ఇంటింటికీ రేషన్‌కు మంగళం

- వచ్చే నెల నుంచి ఎండీయూ వాహనాలు రద్దయ్యే అవకాశం
- సరుకులు పొందాలంటే దుకాణాలకు వెళ్లాల్సిందే
- అగమ్యగోచర స్థితిలో దివ్యాంగులు, వృద్ధులు

సరుకుల కోసం రేషన్ షాపుల వద్ద గంటల తరబడి నిరీక్షించడం.. కొన్ని సందర్భాల్లో సర్వర్ మొరాయిస్తే వీటిని పొందేందుకు మరుసటి రోజు రావడం.. అప్పటికీ అందుతుందానంటే అదీ అనుమానమే.. ఇదీ 2019కి ముందుకు వరకు పరిస్థితి. ఈ తరుణంలో ఆ ఏడాదిలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ సమస్యలకు చెక్ పెట్టింది. నూతన విధానాన్ని ప్రవేశపెట్టి.. ఇంటి వద్దే రేషన్ సరుకులను అందించాలనే లక్ష్యంతో ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ప్రక్రియతో లబ్ధిదారులు తమ ఇళ్ల వద్దే సరుకులను పొందుతూ ఎంతో సంతోషంగా ఉన్నారు. తాజాగా ఈ విధానాన్ని రద్దు చేయనున్నట్లు కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.

నెల్లూరు సిటీ / నెల్లూరు(వీఆర్సీ సెంటర్) / నెల్లూరు (బారకాసు): రెక్కాడితే గానీ డొక్కాడని కూలీలు.. గృహిణులు.. వృద్ధులు.. దివ్యాంగులకు రేషన్ షాపుల వద్ద తిప్పల్లేకుండా ఉండాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దే నిత్యావసర సరుకులను పొందేలా వ్యవస్థను ప్రవేశపెట్టారు. దీని ద్వారా ప్రతి నెలా తొలి వారంలో ఇంటి వద్దే రేషన్ సరుకులు అందేవి. అయితే ప్రజలకు ఎంతో ఊరటగా నిలిచిన ఈ వ్యవస్థను రద్దు చేయనున్నామని చంద్రబాబు ప్రకటించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ప్రజలకు మేలు చేసే పనులపై ఎందుకింత కక్ష అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇక వ్యయప్రయాసలే..


వాస్తవానికి కొన్ని కుటుంబాలకు రేషన్ దుకాణం ఇంటికి సమీపంలో ఉంటే.. ఎక్కువ మందికి రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. 2019కి ముందు వరకు సరుకుల కోసం రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఒక్కోసారి సర్వర్ పనిచేయడంలేదు.. రేపు రండి అంటూ డీలర్ చెప్పే పరిస్థితీ ఉండేది. ఈ తరుణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులను సజావుగా అందించారు. నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ విధానం ప్రజలకు చేరువైందని గ్రహించిన ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేసేందుకు పావులు కదుపుతోంది. ఇక రేషన్ దుకాణాల వద్దే సరుకులను అందజేసేలా ప్రణాళికను సిద్ధం చేస్తోంది. అమరావతిలో కలెక్టర్లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో సీఎం చంద్రబాబు ఇదే అంశాన్ని ప్రస్తావించారు.



ఎండీయూ వాహనం ద్వారా సరుకులను అందుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

రేషన్ డీలర్ల కోసమేనా..?

నిజానికి రేషన్ సరుకులు పొందే వారిలో నిరుపేదలే ఎక్కువ మంది ఉంటారు. ఈ తరుణంలో రేషన్ షాపుల వద్దే సరుకులను పొందాలనే నిబంధన పెడితే వీరు ఆ రోజుల్లో కూలీ పనులను మానుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతుంది. మరోవైపు రేషన్ డీలర్లకు మేలు చేసేందుకే ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నారనే చర్చా జరుగుతోంది.



కూటమి పార్టీల కార్యకర్తలకు ప్రాధాన్యం..!

కూటమి పార్టీలు టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలను రేషన్ డీలర్లుగా నియమించి వారికి లబ్ధి చేకూర్చేందేందుకు ప్రభుత్వం యత్నిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎండీయూ వాహనాలను పక్కనబెట్టేందుకు సిద్ధమైంది. ఇదే జరిగితే రేషన్ షాపుల వద్ద జనం బారులు తీరాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.

బియ్యం ఒక్కటే పంపిణీ

టీడీపీ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో లబ్ధిదారులకు కేవలం బియ్యాన్నే అందజేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో బియ్యం, చక్కెర, గోధుమ పిండి, కందిపప్పును పంపిణీ చేసేవారు. అయితే ప్రస్తుతం కేవలం బియ్యంతోనే సరిపెడుతున్నారు. ఇదే అంశమై లబ్ధిదారులు ప్రశ్నిస్తే, తమకు ప్రభుత్వం నుంచి బియ్యం మాత్రమే వచ్చిందని, తర్వాతి నెల ఇస్తామనే సమాధానం వస్తోంది.

రేషన్ వాహనం తీసేస్తే చాలా ఇబ్బంది



ప్రతి నెలా మా ఇంటి వద్దకు వచ్చే వాహనం ద్వారా రేషన్ సరుకులను ఇస్తున్నారు. ఈ విధానం చాలా బాగుంది. ఇక నుంచి రేషన్ షాపులకెళ్లి తెచ్చుకోవాల్సి ఉంటుందంటున్నారు. ఇలాగైతే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. నేను వృద్ధురాలిని.. నా వారు చాలా దూరంలో నివసిస్తున్నారు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్నా. దూరంగా ఉండే రేషన్ షాపులకెళ్లడం చాలా కష్టం.

– కట్టమంచి బుజ్జమ్మ, మైపాడు రోడ్డు

ఇంటి వద్దే అందించేవారు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ సరుకులను ఇంటి ముంగిటకే తీసుకొచ్చి అందించేవారు. ఈ విధానం ద్వారా వృద్ధులకు ఎంతో ఊరట లభించేది. రేషన్ వాహనాలను తీసేసి.. దుకాణానికి వెళ్లి సరుకులను తీసుకోవాలనే నిబంధనను టీడీపీ ప్రభుత్వం విధిస్తే అవస్థలు తప్పవు. ఇలా ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదు. వృద్ధులనే కనికరం లేకుండా ప్రవర్తించడం తగదు.

– పాతపాళెం ఉత్తరమ్మ, బోడిగాడితోట

రేషన్ దుకాణానికి వెళ్లి తెచ్చుకోవాలంటే కష్టమే



ఇంటింటికీ వచ్చి రేషన్ సరుకులను ఇచ్చే ప్రక్రియ చాలా బాగుంది. ఇప్పుడు రేషన్ వాహనాలను తొలగించి.. దుకాణానికి వెళ్లి తెచ్చుకోవాలంటే చాలా కష్టం. నాకు వయస్సు పైబడింది. ఎక్కువ దూరం నడవలేను. ఇంటింటికీ వాహనం వచ్చి రేషన్ సరుకులను ఇస్తేనే మంచిది. లేకపోతే నరకయాతన పడాల్సి ఉంటుంది. గతంలో రేషన్ దుకాణాలకు వెళ్లి సరుకులను తీసుకోవాలంటే నానా పాట్లు పడేవాళ్లం. రేషన్ వాహనాలను కొనసాగించాలి.

– నగరిపాటి రాధమ్మ, మైపాడు రోడ్డు

ఒక పూట అంతా సరిపోతుంది



అప్పటి రోజులను తలుచుకోవాలంటేనే భయంగా ఉంది. మండుటెండ.. వర్షంలోనూ రేషన్ దుకాణాల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. వాహనాల ద్వారా సరుకుల పంపిణీ ప్రక్రియ చాలా బాగుంది. రేషన్ దుకాణం దూరంగా ఉండటంతో సరుకులు తెచ్చుకోవాలంటే అక్కడే ఒక పూటంతా సరిపోతుంది. దీంతో ఎంతో సమయం వృథా అవుతుంది.

– మురళీకృష్ణారెడ్డి, శెట్టిగుంటరోడ్డు

నెల్లూరులో ఇలా..

డివిజన్లు :	54
పంచాయతీలు :	18
ఎండీయూ వాహనాలు:	85
పనిచేస్తున్న సిబ్బంది:	85
రేషన్ దుకాణాలు:	174
లబ్ధిదారులు:	1,50,316 మంది

వృద్ధులకు అగచాట్లే



రేషన్ వాహనాల ద్వారా సరుకులను పంపిణీ చేసే పద్ధతి బాగుంది. కానీ వచ్చే నెల నుంచి రేషన్ షాపుల ద్వారా మాత్రమే సరుకులను ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ విధానంతో వృద్ధులు, అనారోగ్యంతో బాధపడే వారికి ఇబ్బందులు తప్పవు. సర్వర్ పనిచేయకపోతే నిరీక్షించాల్సి వస్తుంది.

– పద్మావతమ్మ, వెంకటేశ్వరపురం

అసౌకర్యం తప్పదు



గతంలో రేషన్ దుకాణంలో ఇచ్చిన సరుకులను బయట తూకం వేయిస్తే కిలోకు 200 గ్రాముల వరకు తేడా వచ్చేది. వాహనాల ద్వారా సరుకులు ఇచ్చే విధానంలో తూకంలో ఎలాంటి తేడా ఉండేది కాదు. ఇప్పుడు రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తే అసౌకర్యంగా ఉంటుంది.

– అరుణ, నెల్లూరు

క్యూలో నిరీక్షించాలంటేనే భయమేస్తోంది



మాకెలాంటి ఇబ్బంది లేకుండా వాహనాల ద్వారా ఇంటి వద్దే రేషన్ సరుకులను అందించేవారు. అయితే ఈ విధానాన్ని రద్దు చేసి రేషన్ దుకాణాల వద్ద సరుకులు తీసుకునేలా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపట్టనుందని తెలిసింది. రేషన్ దుకాణాల వద్ద క్యూలో నిరీక్షించాలంటేనే భయమేస్తోంది.

– పద్మ, బాలాజీనగర్

క్లుప్తంగా

న్యాయమూర్తికి సత్కారం



నెల్లూరు (లీగల్): కర్నూలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జిగా పదోన్నతిపై వెళ్తున్న నెల్లూరు ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కపర్థికి వీడ్కోలు సభను నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సత్కరించారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమమహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్యాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రంగనాథుడికి విశేష పూజలు

నెల్లూరు(బృందావనం): ఆండాళ్ అమ్మవారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని రంగనాయకులపేటలోని శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పేట ఉత్సవం, తిరుమంజనం, ప్రాకారోత్సవం తదితరాలను బుధవారం నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు బదిలీ అయి, తాజాగా జిల్లాకు వచ్చి కలెక్టరేట్లో పోస్టింగ్‌లు పొందిన తహసీల్దార్లు కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయ్‌కుమార్‌తో పాటు వివిధ విభాగాలకు అధిపతులుగా నియమితులైన శాంతకుమారి, సుధాకర్, శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసులు, నాగలక్ష్మి, రాజ్యలక్ష్మి కలిశారు. డీఆర్వో లవన్న పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయంలో నేటి నుంచి ఉత్సవాలు

నెల్లూరు(బృందావనం): ఏసీనగర్‌లోని కోదండరామపురంలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారి దేవస్థాన వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామని దేవస్థాన కమిటీ చైర్మన్ పత్తి నరసింహం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు గురువారం గోపూజ, గణపతిపూజ, కలశస్థాపనను నిర్వహించనున్నామని చెప్పారు. ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వనాథస్వామి దేవస్థానం నుంచి బోనాల ఉత్సవాన్ని సాయంత్రం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అదే విధంగా శుక్ర, శనివారాల్లో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు.

'బిట్రగుంట' అభివృద్ధిపై దృష్టి సారించాలని వినతి

నెల్లూరు(దర్గామిట్ట): బిట్రగుంట రైల్వే కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. బిట్రగుంట రైల్వే కేంద్ర ప్రాధాన్యాన్ని వివరించారు.

పెద్దాస్పత్రిలో అన్నదానం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని పెద్దాస్పత్రిలో రోగుల సహాయకులకు అన్నదానాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. తన తండ్రి నరసారావు వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని అసోసియేషన్ సెక్రటరీ స్వర్ణ రమేష్‌బాబు చేపట్టారు. స్వర్ణ పద్మజ, పెద్దేటి దేదీప్య, రాజారావు, అసోసియేట్ ప్రెసిడెంట్ సుబ్బరాజు, అమరేంద్రరెడ్డి, కేఎంకే రెడ్డి, బలరామయ్యనాయుడు, గోపాల్‌రెడ్డి, ప్రసాద్, సుబ్బరామిరెడ్డి, వెంకట్రావు, శేషగిరిరావు పాల్గొన్నారు.

టీకాలను సకాలంలో వేయాలి

నెల్లూరు(అర్బన్): పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉండే చిన్నారులు, గర్భిణులకు టీకాలను సకాలంలో వేసి వారిని వ్యాధుల బారి నుంచి కాపాడాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఉమామహేశ్వరి సూచించారు. టీకాల కార్యక్రమంపై కిసాన్‌నగర్‌లోని యూపీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డాక్టర్లు మిస్బా సుల్తానా, సునీల్‌బాబు, కోఆర్డినేటర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ పథకాలపై అవగాహన

నెల్లూరు(దర్గామిట్ట): పోస్టల్ శాఖ ద్వారా అందుతున్న పలు పథకాలపై అవగాహన కల్పించేలా డాక్ చౌపల్ కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, జిల్లా ఉప ఖజానాధికారి లోకేష్, ఆత్మ పీడీ దొరసాని, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జేకే రెడ్డికి పరామర్శ

నెల్లూరు సిటీ: మాజీ ఎమ్మెల్యే జేకే రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్యంపై ఆరాతీశారు. పార్టీ నేతలు స్వర్ణా వెంకయ్య, మల్లు సుధాకర్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, పాశం శ్రీనివాస్, హరిబాబుయాదవ్, పాలకీర్తి రవికుమార్, కల్లూరు లక్ష్మీరెడ్డి, ప్రసాద్, కొండేటి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

- నాలుగో మైలు సెంటర్‌లోని అశోక్‌నగర్‌కు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత దువ్వూరు మధుసూదన్‌రెడ్డి కుటుంబసభ్యులను పార్టీ రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. మధుసూదన్‌రెడ్డి ఇటీవల మరణించడంతో ఆయన కుమారుడు సుజీత్‌కుమార్‌రెడ్డికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఒకటో డివిజన్ కార్పొరేటర్ జానా నాగరాజ్‌గౌడ్, నేతలు యనమల హరియాదవ్, స్వర్ణా వెంకయ్య, కోటేశ్వరరెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి, పాలకీర్తి రవికుమార్, శ్రీధర్, ఇక్బాల్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష

నెల్లూరు (అర్బన్): తల్లి పాలు పుట్టిన బిడ్డకు శ్రీరామరక్ష అని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల ముగింపును పురస్కరించుకొని వీఆర్సీ నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీని వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సహకారంతో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యతేజ మాట్లాడారు. పలు వ్యాధులు రాకుండా ఉండాలంటే బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. అనంతరం స్త్రీ, శిశు సంక్షేమ అధికారి హేనా సుజన్ మాట్లాడారు. మొదటి ఆర్నెల్ల వరకు తల్లిపాలు ఇవ్వడం, ఆపైన సురక్షితమైన పౌష్టికాహారాన్ని బిడ్డకు ఇస్తూ రెండేళ్ల వరకు పాలు పట్టించవచ్చన్నారు. ఆర్డీఓ మలోల, డీఎంహెచ్ఓ పెంచలయ్య, సర్వశిక్ష అభియాన్ పీఓ ఉషారాణి, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, అడిషనల్ కమిషనర్ శర్మద తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల సంక్షేమానికి కృషి

నెల్లూరు(బృందావనం): పాస్టర్ల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బెన్హర్‌బాబు పేర్కొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన బెన్హర్‌బాబు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సదాశివరావుకు అభినందన సభను కపాడిపాళెంలోని గ్రేస్ ఫెలోషిప్ చర్చిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బెన్హర్‌బాబు మాట్లాడారు. గత ప్రభుత్వ తరహాలోనే పాస్టర్లకు గౌరవ వేతనాన్ని కొనసాగించాలని కోరారు. మహాత్మాగాంధీనగర్‌లో క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలన్నారు. అనంతరం వారిని సత్కరించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్, ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి కిషోర్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి జాషువా, సహాయ కార్యదర్శులు శ్యామ్‌ప్రసాద్, పీటర్ ఆత్మామీనన్, వినోష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తి సంఘాలతో ఎంతో మేలు

నెల్లూరు(అర్బన్): ఉత్పత్తిదారుల సంఘాలుగా రైతులు ఏర్పడితే ప్రభుత్వం నుంచి ఎన్నో లాభాలు కలుగుతాయని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయ సంచాలకులు డాక్టర్ ప్రమీలరాణి పేర్కొన్నారు. రాష్ట్రంలో కృషి విజ్ఞాన కేంద్రాలను స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నగరంలోని ఆకుతోటలో గల కేవీకేలో స్వర్ణోత్సవ సంబరాలను బుధవారం నిర్వహించారు. నిమ్మ పంట సాగు చేసుకుంటున్న నాలుగు సంఘాలకు చెందిన షెడ్యూల్డ్ కులాల సభ్యులకు స్ప్రేయర్లు.. ఆక్వా రైతులకు ఏరియేటర్లను పంపిణీ చేశారు. ఎన్జీ రంగా విశ్వవిద్యాలయ ఉప సంచాలకుడు డాక్టర్ ముకుంద, సదరన్ జోన్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చి సుమతి, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ లలితాశివజ్యోతి, డాక్టర్ ఓబయ్య, డాక్టర్ వినీత, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి శ్రావణ మాస మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో సీతామహాలక్ష్మి అమ్మవారికి పల్లకిసేవ, సామూహిక కుంకుమపూజలను శుక్రవారం నుంచి ఈ నెల 30 వరకు నిర్వహించనున్నామని మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను మందిరంలో బుధవారం ఆవిష్కరించారు. కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు, సహాయ కార్యదర్శి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఏసీ స్టేడియంలో మొక్కల పెంపకం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మొక్కలను ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నాటారు. మహ్మద్ రఫీ, అసోసియేషన్ ప్రెసిడెంట్ రామ్మోహన్‌రెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్ నలబోలు బలరామనాయుడు, కృష్ణయ్య, మారుతిరావు, పత్తిపాటి రమణయ్య, పులగల సుబ్బారావు, పిచ్చయ్య, నైజాం వెంకటేశ్వర్లు, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 46వ డివిజన్లో నెలకొన్న సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్ పేర్కొన్నారు. బృందావనం, నక్కలోళ్ల సెంటర్‌లో పారిశుధ్య, తాగునీటి సమస్యలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం సమస్యలను ఆరాతీశారు.

పోలీసుల పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయితీ

నెల్లూరు(క్రైమ్): జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ఎస్పీ కృష్ణకాంత్ తన కార్యాలయంలో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. పోలీస్ పిల్లలకు స్కూల్ ఫీజుల్లో 30 శాతం రాయితీ ఇచ్చేందుకు ముందుకొచ్చిన యాజమాన్యాలను ఎస్పీ అభినందించారు. సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తున్న ఎస్పీకి ఏపీ పోలీస్ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎస్పీని స్కూళ్ల యాజమాన్యాలు, స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు.

26 నుంచి కృష్ణాష్టమి ఉట్టి మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ మెయిన్‌రోడ్డులోని పిండిమిల్లు సెంటర్‌లో కృష్ణాష్టమి ఉట్టి మహోత్సవాలను ఈ నెల 26 నుంచి 30 వరకు నిర్వహించనున్నామని నిర్వాహకుడు కొట్టే వెంకటేశ్వర్లు తెలిపారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు అవినాష్‌రాజు, సత్యనారాయణ, తిరుపాల్‌రెడ్డి, రమేష్‌రాజు, కొట్టే ఇంద్రవికాస్, ఆకుల విష్ణుష్, అశోక్, శేఖర్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

ఆండాళ్ అమ్మవారికి పూజలు



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని కృష్ణ మందిరంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, పూజలను బుధవారం నిర్వహించారు. ఆండాళ్ గోదాదేవి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. మందిర ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను జరిపారు. మందిర ధర్మకర్త వెంకటేశ్వర్లు, కమిటీ ప్రధాన కార్యదర్శి సుబ్బరామరాజు, ఉపాధ్యక్షుడు వేణుబాబు, సహ కార్యదర్శి ఎల్ఎస్ యాదవ్, కాంతమ్మ, నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యావేత్త వైటీ మిత్రకు సత్కారం



నెల్లూరు(బృందావనం): రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విద్యావేత్త వైటీ మిత్ర 92వ జన్మదిన వేడుకలను పూర్వ విద్యార్థులు బుధవారం నిర్వహించారు. ఏబీఎం హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో మిత్ర దంపతులను సత్కరించారు. చాంబర్స్ మెమోరియల్ డొనీహాల్ ఇంగ్లిష్ సర్వీస్ చాప్లిన్ రెవరెండ్ డేవిడ్ లివింగ్‌స్టన్, అసోసియేట్ చాప్లిన్ డాక్టర్ రాజకుమారి, రెవరెండ్లు నిర్మల్‌కుమార్, డేవిడ్ దయాసాగర్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ ఆనందరావు, త్రివేణి హాస్పిటల్స్ డాక్టర్ సుందర్, ఇంగ్లిష్ సర్వీస్ కార్యదర్శి శరత్‌స్టీవెన్సన్, పాల్‌ఆమ్‌స్ట్రాంగ్, కీబోర్డు ప్లేయర్ శారాప్రవీణ, జయపాల్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రప్రసాద్‌కు అభినందన

నెల్లూరు(బృందావనం): తెలంగాణ సారస్వత పరిషత్ పోలూరి హనుమజ్జానకీరామశర్మ పురస్కారానికి నెల్లూరుకు చెందిన పద్యకవి మెట్టు రామచంద్రప్రసాద్ ఎంపిక కావడంపై సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు. పొదలకూరు రోడ్డులోని నేతాజీనగర్‌లో ఆయన్ను అభినందించారు. జర్నలిస్ట్ అసోసియేషన్, సాహితీ ప్రపంచం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచారాధికారి పరవస్తు నాగసాయిసూరి, రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, విశ్రాంత ఏఎస్సై మహబూబ్‌బాషా, దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. సంతపేటకు చెందిన వెంకటేష్ (31) ఎలక్ట్రీషియన్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపంలో గల తన స్నేహితుడి సంవత్సరీక కార్యక్రమానికి ఈ నెల నాలుగున హాజరయ్యారు. అనంతరం బైక్‌పై ఇంటికి బయల్దేరారు. ములుమూడి బస్టాండ్ వైపు వెళ్తూ, నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్ వద్దకొచ్చేసరికి బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. తలకు తీవ్రగాయమైన ఆయన్ను రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కు స్థానికులు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం నారాయణ..అక్కడి నుంచి మెడికవర్ హాస్పిటల్‌కు కుటుంబసభ్యులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు నార్త్ ట్రాఫిక్ పోలీసులకు మృతుడి సోదరుడు సాయికుమార్ ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని ఎస్సై గీతారమ్య పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్ మృతికి సంతాపం

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇందుకూరుపేట కానిస్టేబుల్ కృష్ణ బుధవారం మృతి చెందారు. ఆయన మృతికి ఏపీ పోలీస్ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, రాష్ట్ర నేత శ్రీహరి సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.